

శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌లో వైభవంగా 'సంక్రాంతి' సంబరాలు

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో మారుతీనగర్-2వ వీధిలో ఉన్న శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌లో శుక్రవారం వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యన్నారాయణ, పాగోటి లక్ష్మీ మాట్లాడుతూ సూర్యుడు మకరరాశిలో ప్రవేశించటాన్ని మకర సంక్రమణం అంటారని, ఈ సంక్రాంతి పండుగను ఆంధ్రులు పెద్ద పండుగగా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం స్కూల్ విధ్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విధ్యార్థులు ఉన్నారు.

త్వరలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం

- అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు
- ఉద్యమ కమిటీ ఏర్పాటు
- ఫిబ్రవరిలో తొలి మహాసభ విజయవాడలో

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రభుత్వాల ఉదాశీనత ఫలితంగా, జవసత్వాలు కోల్పోయిన రాష్ట్ర గ్రంథాలయ వ్యవస్థ పునర్వికాసానికి త్వరలో ఒక ఉద్యమం ప్రారంభించాలని విజయవాడలో జరిగిన సదస్సు తీర్మానించినట్టు అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు తెలిపారు. విజయవాడ 35వ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం పునర్వికాస సదస్సు జరిగినట్టు, కవులు, రచయితలు, ప్రముఖ ప్రచురణ సంస్థల ప్రతినిధులు హాజరైనట్టు ఆయన చెప్పారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో సదస్సు తీర్మానాలను వివరించారు. ప్రధాన వక్తగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ హాజరయ్యారని, కూటమి ప్రభుత్వంలో ఆయన ఉన్నా, గ్రంథాలయ వ్యవస్థ పట్ల ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్యమే దుస్థితికి కారణమని ఆవేదనాపూరితంగా విమర్శించినట్టు ధర్మారావు తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ చూపాలని కోరుతూ సదస్సు ఒక తీర్మానం ఆమోదించింది. గ్రంథాలయ సెస్ ద్వారా స్థానిక సంస్థల నుంచి వస్తున్న ఆదాయం, గ్రంథాలయాల నిర్వహణ, అభివృద్ధికి కేటాయించాలని మరో తీర్మానం కూడా ఆమోదించినట్టు ధర్మారావు చెప్పారు. ఒకప్పుడు రచయితల పుస్తకాలను గ్రంథాలయ సంస్థలు అచ్చు వేసే స్థితిలో ఉండేవని, ఇప్పుడు వాటి నిర్వహణకే ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారని, గ్రంథాలయ సెస్ పేరుతో వస్తున్న కోట్ల రూపాయలను ప్రభుత్వాలు దారి మళ్ళించడమే ఈ దుస్థితికి కారణమని దాదాపు వక్తలంతా అభిప్రాయ పడ్డారని తెలిపారు. సంప్రదాయ ప్రచురణ రంగానికి రచయితల మీద పట్టు నడలి పోయిందని, ఫలితంగా రచయితల్లో ఐక్యత కొరవడిందని సదస్సు అభిప్రాయపడింది. పునర్వికాస ఉద్యమ కమిటీకి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ ను కన్వీనర్ గా సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అన్ని జిల్లాల్లో ఉద్యమ కమిటీలను ఏర్పాటు చేసేందుకు, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ నాయకులు పర్యటించి, జిల్లాల వారి సమస్యలను నిర్వహించి, జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. ఫిబ్రవరిలో విజయవాడలోని మాకినేని భవన్లో ఉద్యమ తొలి మహాసభ జరపాలని, పూర్తిస్థాయి ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించింది.

సిద్ధాంతాలు, రాజకీయాలకు అతీతంగా విద్యా వంతులను మరింత విజ్ఞాన వంతులుగా తీర్చి దిద్దడంలో గ్రంథాలయాలు నిర్వహిస్తున్న పాత్రను పాఠక సమాజానికి గుర్తు చేయాలని, గ్రంథాలయాల ప్రాధాన్యత, ఆవశ్యకతను తెలియజేస్తూ, గ్రంథాలయాలను ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఉద్యమ స్వరూపమని సదస్సు స్పష్టం చేసిందని తెలిపారు.

మందస ఎస్ఐగా కృష్ణప్రసాద్

విశాలాంధ్ర - మందస : మందస పోలీసు స్టేషన్ ఎస్.ఐగా కె.కృష్ణప్రసాద్ శుక్రవారం సాయంత్రం బాధ్య తలు చేపట్టారు. గత మూడు నెలలుగా ఇక్కడ ఎస్.ఐ పోస్టు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే.

గోకులం షెడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నడుకుదిటి

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలో బంటుపల్లి పంచాయతీ నడుకుదిటి పాలెం లో గోకులం షెడ్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పశుసంవర్ధక శ్రీకాకుళం డా. కెరాజగోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్ ఏవీహెచ్ దుర్గారావు, ఏపీఎం, డా. రాంకుమార్, టీడీపీ పిసిని జగన్నాధంనాయుడు లంక నారాయణరావు, వెలిసేటి సురేష్ అధికారులు మరియు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో నూతన స్టోర్‌ను ప్రారంభించిన రాయల్ ఓక్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : భారతదేశంలోని ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ అయిన రాయల్ ఓక్ ఫర్నిచర్, శ్రీకాకుళంలో ని సింహద్వారం దరి విశాల్ మార్ట్ ఎదురుగా తమ కొత్త స్టోర్ ప్రారంభోత్సవం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. ఈ స్టోర్ ప్రారం భంతో, దేశంలో బ్రాండ్ యొక్క స్టోర్ ల సంఖ్య 172కు చేరింది. ఈ భారీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాయల్ ఓక్ ఇన్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ విజయ్ సుబ్రమణ్యం , రాయల్ ఓక్ ఇన్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్, మథన్ సుబ్రమణ్యం, శ్రీకాకుళం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్, కింజరాపు హరి ప్రసాద్ తో పాటుగా కిరణ్ ఛబారియా, రాయల్ ఓక్ ఫ్రాంచైజ్ హెడ్ తమ్మయ్య కొటేరా హెడ్ - విఎం ఎన్ఎస్ఓ - రాయల్ ఓక్, కె పి వినోద్, స్టేట్ హెడ్, ఏపీ టీఎస్ - రాయల్ ఓక్ సహా రాయల్ ఓక్ బృందం నుండి అతిథులు కూడా పాల్గొన్నారు. దాదాపు 12000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్ విస్తృత శ్రేణిలో లివింగ్ రూమ్స్, బెడ్‌రూమ్స్, డైనింగ్ రూమ్స్, ఆఫీస్ %ఢ% ఔట్డోర్ సహా మరెన్నో వాటికి తగిన ఫర్నిచర్ అందిస్తుంది. శ్రీకాకుళం వినియోగదారులు అనేక రకాల ఆకర్షణీయమైన మరియు పనితీరు గల వస్తువులను అత్యంత సరసమైన ధరలలో, తమకు సౌకర్యవంతంగా ఉన్న ప్రాంతంలో కనుగొనవచ్చు. ఈ స్టోర్ ఆంధ్రప్రదేశ్‌లో రాయల్ ఓక్ యొక్క మొత్తం స్టోర్స్ సంఖ్యను 14 కు చేరింది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాయల్ ఓక్ ఫర్నిచర్ చైర్మన్ విజయ్ సుబ్రమణియం మాట్లాడుతూ భారతదేశంలో మా 172వ స్టోర్ మరియు ఆంధ్రప్రదేశ్‌లో 14వ స్టోర్‌ని ప్రారంభించడం మాకు చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీకాకుళం స్టోర్ దేశవ్యాప్తంగా మా విస్తరణ ప్రణాళికను మరింత పటిష్టం చేస్తుందన్నారు. ఇది మా విలువైన కస్టమర్‌లకు సరసమైన ధరలకు అత్యుత్తమ నాణ్యత గల ఫర్నిచర్‌ను అందించడానికి రాయల్ ఓక్ యొక్క అంకితభావాన్ని నొక్కి చెబుతుందన్నారు.

తిరుమల 'తొక్కిసలాట'కు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర - నరసన్నపేట : ప్రపంచ ప్రసిద్ధ పుణ్య క్షేత్రం తిరుమలలో తొక్కిసలాట కారణంగా భక్తులు మృతికి ప్రభుత్వ వైఫలమ్యే కారణ మని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భద్రతను గాలికి వదిలేసి, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందిన కారణంగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.50లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. క్షతగాత్రులకు ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందించాలని, ఈ ఘటన ప్రభుత్వ తప్పిదంగా ఒప్పుకుంటూ, వారు డిశ్చార్జి అయి ఇంటికి వెళ్ళేటప్పుడు కనీసం రూ.5లక్షలు అందించాలని చంద్రబాబుకు డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

తిరుమలలో తొక్కిసలాట ఘటనకు కూటమి సర్కార్‌దే బాధ్యత

మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర - మందస : తిరుమలలో జరిగిన తొక్కిసలాట ఘటనకు కూటమి సర్కార్‌దే బాధ్యత అని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మందస వాసుదేవ ఆలయ దర్శనానికి ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి తిరుమలలో వైకుంఠ దర్శన టిక్కెట్లు జారీలో తొక్కిసలాట వల్ల భక్తులు మృతి చెందడం, గాయపడడం చాలా బాధాకరమని, ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది కూటమి ప్రభుత్వం వైఫల్యమేనని, ఈ ఘటనకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. హోంశాఖ, దేవాదాయ శాఖలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో చిన్నపాటి సంఘటపై సైతం జరగలేదని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయ జోక్యం బాగా పెరిగిపోయిందని ఆధ్యాత్మిక భావంతో ఉన్న భక్తులకు తగిన గౌరవం దక్కడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తిరుమల పవిత్రత గురించి మాట్లాడే కూటమి ప్రభుత్వ పెద్దలు వైకుంఠ ద్వార దర్శనం విషయంలో జరిగిన దుర్ఘటనకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కళియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి దేశం నలుమూలల నుంచి వస్తున్న భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం తిరుమల తిరుపతి పవిత్రతను పరిరక్షించడమే కాక భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఎంపీపీ డొక్కరి దానయ్య, ఉంగ సాయి, పైల చిట్టి, చేరుకు నాగార్జున, గిన్ని తిరుపతి, జానకిరావు, అగ్గున సూరిలు ఉన్నారు.

అభాగ్యులకు అండగా నిలిచిన జగన్

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం ఎర్ర గోవిందపుట్టుగ గ్రామంలో నివశిస్తున్న ఓ నిరుపేద కుటుంబ యజమాని బుడంకాయల శ్రీనివాస్ కొద్ది రోజుల క్రితం దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతో బాధ పడుతూ మృతి చెందాడు. ఆయన మృతితో ఆ కుటుంబం జీవనాధారం లేక రోడ్డున పడ్డారు. అటువంటి పరిస్థితిలో తీవ్ర కష్టాలతో సతమత మవుతున్న ఆ కుటుంబానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ కౌన్సిల్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు నెయ్యిల జగన్నాథ్ బెహరా స్పందించి అండగా నిలిచారు. ఉన్నత భావాలు కలిగి మానవత్వంతో జగన్ ముందుకు వచ్చి ఆ కుటుంబానికి శుక్రవారం కలిసి రెండు నెలలకు సరిపడే విధంగా రెండు ప్యాకెట్ల నాణ్యమైన బియ్యం, కిరాణా సరుకులను అందజేశారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని మృతుడు శ్రీనివాసరావు భార్య భూలక్ష్మికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి జగన్‌తో పాటు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా జనరల్ సెక్రటరీ పల్రి కేశవరావు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా భూలక్ష్మితో పాటు గ్రామస్తులు, ప్రసాద్ తదితరులు సహాయం అందించిన జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

విశాలాంధ్ర - మందస : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపిసి విద్యార్థిని బొర్ర కుమారి రోనా అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత చెందడంతో శుక్రవారం ఎజిఎంవో తేజేశ్వరరావు అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జంతుశాస్త్ర అధ్యాపకులు చింతాడ శరత్‌బాబు వివిధ కళాశాలలో పని చేస్తూ ఆ ఏడాది బైపీసీ విభాగంలో అత్యధిక మార్కులు పొందిన వారికి 5వేల రూపాయలు నగదు ప్రోత్సాహకంతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులకు సన్మానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా బొర్ర కుమారి రోనాకు 5వేల రూపాయలు నగదు బహుమతి అందిస్తూ ఆమె తల్లిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించడం వలన వారిలో మరింత ఉత్సాహం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జి.రమణమూర్తి, అధ్యాపకులు బి.సాహు, దుర్యోదన, ఎన్.ఎస్.ఎస్ పివోలు జి.రమణమూర్తి, బి.ప్రవీణ్, ఉమా, నాగభూషణ్, గోవిందరాజు, శాంతికుమారి, రవికుమార్, జానికిరాము, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



విశాలాంధ్ర - సోంపేట : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాలన కలబోసే సంక్రాంతి పండగ వాతావరణాన్ని కళాశాల విద్యార్థిని విద్యార్థులు నెలకొల్పారు. సంప్రదాయ రీతిలో వస్త్రధారణతో హాజరై అందమైన రంగవల్లికలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే సంక్రాంతి శోభ ఉట్టిపడేలా చక్కనైన సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు ముఖ్యఅతిథిగా హాజరైన హెచ్ఎం ప్రమోద్‌కుమార్ పాడి, హెచ్ఎం ఎం.సోమేశ్వరరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ, ఎజిఎంసి పి.రజనీకుమారి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ప్రతినిధులు రామినాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

అవిశ్రాంత పోరాట యోధులు పరమేశ్వరరావు ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు

విశాలాంధ్ర - పలాస : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఒక సూత్రబద్ద వైఖరితో పని చేయడం నేర్పిన పోరాట యోధులు నూతలపాటి పరమేశ్వర రావు అని ఏపిటిఎఫ్ జిల్లా నాయకులు అన్నారు. శుక్రవారం పలాసలో జరిగిన నూతలపాటి పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి సభ ఏపీ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వి అనిల్ కుమార్ మాట్లాడుతూ పరమేశ్వరరావు రాష్ట్రంలోని కార్యకర్తలు అందరిని తయారు చేయడంలో గొప్ప పాత్ర పోషించారని, ఏపీటీఎఫ్ విధాన పత్రం ప్రకారం ఏ విధంగా కార్యకర్తగా పనిచేయాలో నేర్పారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో నిర్వహించవలసిన పాత్ర వారి దగ్గర నేడు రాష్ట్రంలో జిల్లాలలో పనిచేస్తున్న నాయకులందరూ నేర్చుకున్నారని, వారితో కలిసి పని చేయడం నిజంగా అదృష్టమని అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో చూపించాల్సిన చొరవ, ఉపాధ్యాయులతో సంఘం నిర్వహించటం, మొదలైన విషయాలతో ఆయన దగ్గర ఉద్యమంలో ఓనమాలు నేర్చుకోవడం నిజంగా అదృష్టమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఉద్యమంలో చిరస్మరణీయులు ఎన్ పరమేశ్వర రావు అని, ఆంధ్రప్రదేశ్ లో 77 సంవత్సరాలుగా ఏపిటిఎఫ్ విద్యారంగ ఉపాధ్యాయ సమస్య పరిష్కారం లో చేస్తుంటే అందులో 56 సంవత్సరాలు నిరంతరము పనిచేసిన గొప్ప నాయకులు పరమేశ్వరరావు అని కొనియాడారు. జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విద్యారంగ ప్రగతి కోసం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కు చెన్నుపాటి లక్ష్మయ్య ఉద్యమ పితామహులు అయితే, సింగరాజు రామకృష్ణయ్య ఉద్యమ రథసారథిగా వినుతికెక్కారు అని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి దాసరి రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఆ ఫెడరేషన్ వారసత్వాన్ని కొనసాగిస్తూ 1965 నుండి 2022 వరకు సుదీర్ఘకాలం ఫెడరేషన్ నిర్వహించి నిర్వచించి వందలాది మంది సుశిక్షితులైన కార్యకర్తలను తయారు చేసి సంస్థలు రాష్ట్రంలో మొనగాడు సంఘంగా తీర్చిదిద్దిన వ్యక్తి నూతలపాటి పరమేశ్వర రావు. అని పేర్కొన్నారు. జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి బి.సుభాష్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఫ్యాప్టో జాక్టో, ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి, ఇలాంటి ఐక్యవేదికలు ఏర్పాట్లు కీలక భూమికగా గుర్తించారు. అనేక, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు అని గుర్తు చేసుకున్నారు. జిల్లా శాఖ ఉపాధ్యక్షులు జి.భీమారావు ఆహ్వానం పలుకగా జిల్లా శాఖ ఉపాధ్యక్షులు కె గోపికృష్ణ వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ఏపీటీఎఫ్ కార్యకర్తలు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్ వి అనిల్ కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి బి సుభాష్ బాబు, ఉపాధ్యక్షులు జి.భీమారావు,బి ఢిల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శిలు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహనరావు, పి తిరుమలరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా బి నేతాజీ, రాష్ట్ర కౌన్సిలర్ కే విజయ్ కుమార్, జి రాజేష్, ఉపాధ్యక్షులు కే గోపికృష్ణ, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు వివి.రమణ, కే.కృష్ణమూర్తి, జీవీ రమణ, పలాస మండల శాఖ అధ్యక్షులు డి.రామన్నాయుడు, ప్రధాన కార్యదర్శి టీవీఎస్ నారాయణ, వజ్రపు కొత్తూరు మండల శాఖ అధ్యక్షులు డి.తులసిరావు, ప్రధాన కార్యదర్శి కే వెంకటరావు, మందస మండల శాఖ అధ్యక్షులు కిరణ్, ప్రధాన కార్యదర్శి సుందరరావు, మెళియాపుట్టి మండల శాఖ అధ్యక్షులు ధర్మారావు, ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, నందిగామ మండల శాఖ అధ్యక్షులు మల్లేశ్వరరావు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ టెక్కలి మండల శాఖ అధ్యక్షులు బాబురావు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సంతబొమ్మాలి మండల శాఖ అధ్యక్షులు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోటబొమ్మాలి మండల శాఖ అధ్యక్షులు రమేష్ ప్రధాన కార్యదర్శి మురళి, సోంపేట మండల కార్యదర్శి ప్రధాన కార్యదర్శి తిరుమలరావు, అధ్యక్షులు దిల్లేశ్వరరావు, కవిటి మండల శాఖ ప్రధాన కార్యదర్శి రాంబాబు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

క్రీడా స్ఫూర్తిని చాటండి

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- ఐపీఎల్ టోర్నీని ప్రారంభించిన జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్

విశాలాంధ్ర - ఆమదాలవలస : యువత క్రీడా స్ఫూర్తితో మెలిగి, గెలుపు వాటములను సమానంగా తీసుకోవాలని జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస జూనియర్ కాలేజీలో ప్రారంభించిన ఏపిఎల్ 2025 టోర్నమెంట్ ను డాక్టర్ దానేటి శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో మెలిగి స్నేహ సంబంధాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. యువతకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని యువత తప్పనిసరిగా ఆటలాడాలన్నారు. డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాల బారిన పడి యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల తమ ఒక్కరి జీవితమే కాకుండా తన కుటుంబము, పరిసరాల్లో ఉండే స్నేహితులు అందరి జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. విద్యార్థి దశలో చదువు, లక్ష్యం పట్ల దృష్టి కేంద్రీకరిస్తే భవిష్యత్తు ఎంత గొప్పగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ గీత విద్యాసాగర్,సనపల మోహన్ సురేష్, పొన్నాడ శ్రీధర్, నేతాజీ మరియు రాజకీయ నాయకులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ నారాయణ స్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - రణస్థలం : శ్రీ నారాయణ స్కూల్ కోష్ఠ నందు సంక్రాంతి వేడుకలను డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆరంభించారు. చిన్నారులకు భోగి పళ్ళ వేసి అందరూ నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని దీవించారు. తెలుగుతనం ఉట్టిపడేలా అందరు విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి హాజరయ్యారు. హరిదాసు, గంగిరెద్దుల వేషాలు అలరించాయి. ముగ్గుల పోటీలు మరియు గాలిపటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. రంగు వల్లులను, గొబ్బెమ్మలతో అలంకరించారు. భోగి మంటలు ఏర్పాటు చేసి, కోలాట నృత్యం ప్రదర్శించారు. డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మీలో ఉన్న చేదు జ్ఞాపకాలను భోగీలో వేసి నూతన ఉత్తేజంతో సంక్రాంతి వేళ పెద్దలను పూజిస్తూ, కనుమవేళ కమ్మనైన విందును ఆరగించి, సుఖంగా, సంతోషంగా, ఆరోగ్యంగా ఉండి మంచి విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ కెల్ల గోవింద్ మాట్లాడుతూ, సంక్రాంతి అంటే పెద్దల పండగ అని, మన పూర్వీకులను ప్రతి ఏడాది ఈ సంక్రాంతి వేళ పూజిస్తూ పెద్దలను గౌరవించాలి అనే భావనను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మంజు భార్గవి, కరస్పాండెంట్ గోవింద్, ప్రిన్సిపాల్ ఎస్. గౌరి నాయుడు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

పాతపట్నం వెంకటేశ్వర స్వామికి వెండి వస్తువులు బహుకరించిన ఎమ్మెల్యే ఎంజిఆర్

విశాలాంధ్ర - జలుమూరు : నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలో కొలువైయున్న శ్రీ వేంకటేశ్వర స్వామిని వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా శుక్రవారం స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి 1,20,000 విలువ గల వెండి ఆభరణాలను ఆయన బహుకరించారు. పలువురు ఎమ్మెల్యే దాతృత్వానికి అభినందించారు. ముందుగా ఆలయ పురోహితులు ఆయనకు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలను పలువురుకు దానధర్మాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పాతపట్నం మండలంకు చెందిన పార్టీ నేతలు అధికారులు పాల్గొన్నారు. ఇంత వరకు ఎవరు స్వామిని దర్శించి పూజలు చేసి వెళ్లడమే తప్ప ఒక శాసనసభ్యునిగా ఉదాతరతో స్వామివారికి వెండి ఆభరణాలు ఇవ్వడం గర్వంగా ఉందని పురోహితులు అర్చకులు అభినందించారు.

నిస్వార్థ సేవలకు చిరునామా ఇందిరాప్రసాద్

వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం జిల్లాలో నడక ఉద్యమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళడంలో సామాజిక సేవల్లో ముందు వరసలో ఉన్న వారిలో ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో గేదెల ఇందిరా ప్రసాద్ అగ్రస్థానంలో నిలుస్తారని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 2025 ప్రెసిడెంట్ ఎం. ప్రభావతి అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రచ్చబండలు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటితరం యువత పెద్దలను నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో తల్లి జ్ఞాపకార్థం ఇందిరాప్రసాద్ కుమారుడు విద్యార్థుల కోసం రచ్చబండలు నిర్మించడం విశేషం అన్నారు. అనురాగాలు, అనుబంధాలు, ఆత్మీయతలు ఆప్యాయతలు కనుమరుగు అవుతున్న ఈ రోజుల్లో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలకు ముందుకు వచ్చి మరణించిన పెద్దలను స్మరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, జి.ఇందిరా ప్రసాద్, శాసపు జోగి నాయుడు, పీజీ గుప్తా, నూతన గవర్నర్ కొంఖ్యాన మురళీ, బివి రవిశంకర్, స్టార్ మహిళా సంఘం అధ్యక్షరాలు జి.లక్ష్మీ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, వివిధ నడక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవం

12న నిర్వహించేందుకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వైసీబీ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు వైసీబీ నెహ్రూ యువకేంద్రం, సెట్శ్రీ సంయుక్తంగా నిర్వహించనున్న స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా ప్రతి ఏటా మాదిరిగానే అనాథ బాలలు నూతన వస్త్రాలతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యులు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, ఎన్వైకే కో-ఆర్డినేటర్ కె.వెంకటఉజ్వల్, సెట్ శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావుతో పాటు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటారన్నారు. స్వామి వివేకానంద అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు.

కాకినాడ ఆదిత్యలో ఘనంగా నేషనల్ యూత్ డే

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా నేషనల్ యూత్ డే ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె సుధా, నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె వెంకట్ ఉజ్వాల్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వివేకానంద చిత్రపటానికి పూల మాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వీరిరువురు మాట్లాడుతూ నేటి యువత మొదట తమ ఉజ్వల భవిష్యత్ పై దృష్టి పెట్టి దానికి సంబంధించి తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె శివ శంకర్ మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానంద వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లి దేశానికీ పేరు ప్రతిష్టలను తీసుకువలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు, ఎన్ఎస్ఎస్ పిఓ ఎల్ మోహనరావు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

తొక్కిసలాట ఘటన కూటమి సర్కార్ వైఫల్యం

విశాలాంధ్ర - మందస : తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని దర్శన టిక్కట్లు జారీ చేసిన సందర్భంగా తొక్కిసలాట వలన భక్తులు మృతి చెందడం, గాయపడడం చాలా బాధాకరమని, ఈ ఘటనకు కూటమి సర్కార్‌దే బాధ్యతని వైఎస్ఆర్‌పి యువజన నేత, వైఎస్ఆర్ ఉద్యానవన యూనివర్సిటీ పాలకమండలి పూర్వ సభ్యులు బత్తిన లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రకటనలో దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రజకులను కించపరిచిన చిట్టిబాబును తక్షణమే అరెస్ట్ చేయాలి

రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాము డిమాండ్

విశాలాంధ్ర - రణస్థలం : రజకులను కించపరిసిన చిట్టిబాబును వెంటనే అరెస్ట్ చేయాలని రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గురజాపు రాము డిమాండ్ చేసారు. శుక్రవారం మండలకేంద్రంలో అయన విలే ఖరలుతో మాట్లాడు తూ రజకులను కించపరిసిచే విధంగా మాట్లాడిన చిట్టిబాబును వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ఒక న్యూస్ ఛానల్ లో చిట్టి బాబు మాట్లాడుతూ పలుమార్లు చాకలి చాకలి అని రజక కులస్తులను ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా మాట్లాడినందుకుగాను రజకులందరు తీవ్రంగా వెతిరేకిస్తున్నామని మండిపడ్డారు. చిట్టిబాబు రజకులు ఆత్మగౌరవం దెబ్బ తినేవిధంగా మాట్లాడినట్టుందని అందుకు గాను ప్రభుత్వం చిట్టిబాబును అరెస్ట్ చేయాలని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎప్పటికీ చాకలి అనే పదంపై నిషేధం ఉన్నప్పటికీ బహిరంగ చర్చల్లో ఒక కులాన్ని ఉద్దేశించి పదే పదే కులంపై చెప్పడం బాధాకరంగా ఉందన్నారు రజకులపై కులం పేరుతో చెబుతూ చిన్నచూపు చూడ్డం తగదని ఇలాంటి కులం పదాలను వాడి అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు చిట్టిబాబు చేసిన తప్పుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో ఎక్కడ లేదని ఇటువంటిది మేధావులు గమనించాలని హితవు పలికారు ఈ సమావేశంలో నాయకులు శంకర్ రామారావు భాస్కర్ మహాలక్ష్మి నాయుడు అచ్చన్న నాగరాజు ఈశ్వర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జీఓ 117 సవరణ ఉత్తర్వులు సమంజసం కాదు

ఎస్టీయు జిల్లా ప్రధానకార్యదర్శి గురుగుబెల్లి రమణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జీఓ 117 రద్దును స్వాగతిస్తున్నాం కానీ రద్దు పేరుతో తీసుకువచ్చిన సవరణలు మాత్రం సమంజసం కాదనిఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 117 సవరణలు పూర్తిగా లోప భూయిష్టంగా ఉన్నాయని 117 ఉత్తర్వుల్లో ఏ విధంగా అయితే ప్రాథమిక పాఠశాలలు విచ్ఛిన్నం జరిగిందో ఇందులో కూడా సమీప పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను తరలించి ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా ఏర్పరచడం, ఫౌండేషన్ పాఠశాలలో 30 మంది విద్యార్థుల వరకూ ఒక్కరే టీచర్ ను ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరణ పేరుతో ప్రాథమికోన్నత పాఠశాలలని పూర్తిగా మూసి వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు.ప్రతి ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్, పీడీ పోస్టులు ఉండాలని సెక్షన్ల వారిగా కాకుండా రోల్ ఆధారంగా ఉన్నత పాఠశాలలో పోస్టు ఉండాలని అలాగే రెండు మీడియం లు ఉండాలన్నారు. విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయ హక్కుల సాధనకు ఎస్టీయు నిరంతరం పోరాడుతూనే ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ సూర శ్రీనివాసరావు

భక్తులకు పులిహోర, చక్రపొంగలి ప్రసాదాలు అందజేత

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జిల్లా వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు. పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నారు. ఈ రోజును విష్ణువును దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. ఎచ్చెర్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు శుక్రవారం స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని అప్పుడే మనిషి జీవితం క్రమశిక్షణతో ముందుకు వెళ్తుందన్నారు. ఆలయ అర్చకులు స్వామి వారి కండువాను సూర శ్రీనివాసరావుకు వేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఆధ్యాత్మిక చింతనతో మెలిగే వారిలో మానసిక ప్రశాంత ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తులు పులిహెూర, చక్రపొంగలి ప్రసాదాలను ఏర్పాటు చేశామని సూర శ్రీనివాసరావు తెలిపారు.

ఇంటింటికి కొళాయి పనులు ప్రారంభించిన టీడీపీ ప్రతినిధులు

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో శుక్రవారం ఇంటింటికీ కొళాయి పనులును తెలుగుదేశం ప్రతినిధులు ప్రారంభించారు. ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి ఆదేశాల మేరకు పట్టణంలో శివనగర్ కాలనీ, కళాసి కాలనీ, వీరన్నాయిడు కాలనీ వీధుల్లో పనులు ప్రారంభించారు. ఈ సంధర్భంగా మేజర్ పంచాయితీ మాజీ సర్పంచ్, గొద్దు చిట్టిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికీ కొళాయిలు ప్రారంభించటం జరిగిందని, దీనితో పట్టణ ప్రజానీకానికి త్రాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ఈవో, పి.ద్రాక్షాయిణి, టిడిపి ప్రతినిధులు, కింజరాపు రామారావు, బోయిన సతీష్, సకలాభక్తుల గోవిందరావు, గొలివి మోహనరావు, రావాడ గణపతిరావు, గుణుపురం రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సంక్రాంతితో నూతన తేజస్సును కలిగి అభివృద్ధి చెందాలి : లయన్.డా.ఎం.కె.మిశ్రో

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : లక్ష్మి నర్సుపేట గ్రామంలో కస్తూరీబా విద్యాలయం నందు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సంద ర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు.ఈ పోటీలు నందు ప్రథమ బహుమతి రిబికాబీ ద్వితీయ బహుమతి నీరజబీ తృతీయ బహుమతి సాయి తేజస్వినిలకు లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్సా.మాజిక వేత్త ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు. ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత .స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. సీఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లయన్.డా.ఎం.కె.మిశ్రో బహుమతులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డా.మిశ్రో మాట్లాడుతూ సంక్రాంతి విద్యార్థి - విద్యార్థినీలలో నూతన తేజస్సును ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా విద్యాలయం ఎస్.ఓ. ఎం.వి.అంబికాబీ ఉపాధ్యాయులు ఉపేంద్రబీ సునీతబీస్వర్ణబీ లక్ష్మీబీ ఈశ్వరీబీ లీలాబీ భవానీబీ అరుణబీ మాలతిబీధన లక్ష్మి మరియు విద్యార్థి -విద్యార్థినీలు పాల్గోన్నారు

గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో చిత్రివీధి సమీపంలో ఉన్న గీతాంజలి స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా స్కూల్‌కు చెందిన విధ్యార్థులు హరిదాసు వేషాధారణలతో పలువురిని ఆకట్టుకున్నారు. అలాగే స్కూల్ ప్రిన్సిపాల్ కోటిబాబు నిర్వహించిన నృత్య, రంగోళి, ఖోఖో, పరుగు పందెం పోటీల్లో విజేతలైన విధ్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

చక్రధరుని దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ చక్ర పెరుమాళ్ళ స్వామి, ప్రగడపుట్టుగ కోదండ రామాలయం,కవిటి రఘునాథ స్వామి ఆలయం సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బెజ్జి పుట్టుగ చక్ర పెరుమాళ్ళ స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. వేకువజాము నుండి సత్యనారాయణ స్వామి,రాజు స్వామి, రాజేష్ స్వామి,రమేష్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున నాలుగు గంటల ముప్పై నిమిషాలకు స్వామివారికి దర్శించేందుకు ఉత్తర ముఖ ద్వార దర్శనం ప్రారంభమైంది. ఉదయం ఐదు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్విరామంగా విష్ణు సహస్రనామ పారాయణం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం దీపోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఉత్తర ముఖ ద్వార దర్శనంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాల స్వీకరించారు. ఎమ్మెల్యే అశోక్ చక్ర పెరుమాళ్ళ స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావు ఆలయ అర్చకులు అశోకుని పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ ను ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావు ఘనంగా సత్కరించారు. సంధ్యా సమయంలో చక్ర పెరుమాళ్ళ స్వామివారి ఆలయ ప్రాంగణంలో అనంత దీపారాధన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పి.రాంబాబు, పి విజయ్ కృష్ణ, కూటమి నాయకులు బి రమేష్, టి.హరనాథ్, సంతోష్ కుమార్ పట్నాయక్, శ్రీనివాస్ రౌలో, విజయ్, మణి చంద్ర పకాష్, భాసుదేవ్ రౌలో తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ మై సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి

విశాలాంధ్ర - జలుమూరు/పాతపట్నం : నియోజకవర్గ కేంద్రం పాతపట్నం కిరణమై కళాశాలలో జరిగిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో పాతపట్నం శాసన సభ్యులు మామిడి గోవిందరావు పాలొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి అనేది పురాతన శాస్త్రంగా వస్తున్న పద్ధతులని శతాబ్దాల క్రితం నుండి ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా పల్లెల్లో ఎంతో పటిష్టంగా జరుపుకుంటారని గుర్తు చేశారు. ఇటువంటి సాంప్రదాయాలను విద్యార్థి విద్యార్థులకు తెలియ జేయవలసిన బాధ్యత మనపై ఉందని మామిడి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కళాశాల సిబ్బంది ప్రజలు విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముందుగా సరస్వతి దేవి పలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రమాదంపై తీర్పు

విశాలాంధ్ర - రణస్థలం : తేదీ 18-5-2019 నాడు పైడి భీమవరం గ్రామం ఏవోఎల్ కంపెనీ దగ్గరలో రణస్థలం మండలం దేరసాం గ్రామానికి చెందిన ఎడ్ల రాములమ్మ భర్త ఎడ్ల రాముని, ఏపీ 31టీఏ 6171 నెంబర్ గల లారీ డ్రైవర్, ముక్తంపురం గ్రామానికి చెందిన అదపాక ఈశ్వరరావు, లారీతో గుద్దించగా జరిగిన ప్రమాదంలో సదరు ఎడ్ల రాము చనిపోయి నందున ఈ ప్రమాదం పై సీఆర్.నెం. 116/19 కేసుగా జె ఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుని వి.బాలకృష్ణ మరియు బి అశోక్ బాబు ఎస్ఐలు దర్యాప్తు నిర్వహించారు. ఏపీపీ ఎల్ నాగభూషణ రావు వాదించగా తేదీ 10.1.2025 శుక్రవారం జెఎంఎఫ్‌సీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శ్రీకాకుళం జడ్జి భరణి సదరు ముద్దాయికి ఆరు మాసాలు జైలు శిక్ష ఐదువేలు జరిమానా విధించినట్లు శుక్రవారం జె ఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

గోకులాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

విశాలాంధ్ర - జలుమూరు/పాతపట్నం : నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం ను వైకుంట ఏకాదశి పర్వదిన సందర్భంగా శుక్రవారం పాతపట్నం శాసన సభ్యులు మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గో అభివృద్ధి అయితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని శాస్త్రీయ పురాణాలు మనకి తెలియజేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం మనతోపాటు ప్రజలకు ఆనందంగా ఉందని మామిడి అన్నారు. గో సేవే గొప్ప సేవ అని ఆయన సూచించారు. ఆయనతో పాటు అధికారులు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మార్మోగిన ఆలయాల్లో భక్తజనం

విశాలాంధ్ర - పోలాకి : ముక్కోటి ఏకాదశి పర్వదినం శుభ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో మహిళలు భక్తులు శుక్ర వారం తెల్లవారుజాము నుండే ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు తీరారు. ఈ సందర్భంగా గంటపేట కళ్యాణ వెంకట రమణమూర్తి ఆలయము అర్చకులు మావుడూరి శ్రీనివాస్ శర్మ భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములను భక్తులకు అందజేశారు. గాతలవలస విష్ణు ఆలయం పిన్నింటిపేట వెంకటేశ్వర ఆలయాల్లో భక్తులు కిటకిటలాడారు. సాయంకాల సమయంలో సహస్రనామ పారాయణంతో పాటు ఆలయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

సిబ్బందికి సాంకేతిక అంశాల పట్ల అవగాహన ఎంతో అవసరం

డ్వామా పీడీ సుధాకర్ రావు

విశాలాంధ్ర - రణస్థలం : మండలాల్లో విధులు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి ఉపాధి హామీ పథకం సిబ్బంది అందరికీ సాంకేతిక అంశాల పట్ల అవగాహన ఎంతో అవసరమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి సుధాకర్ రావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో రణస్థలం, లావేరు మండలాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు పిడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పనులు జరిగే సమయంలో నిర్దిష్టమైన కొలతలు మేరకు పనులు చేయించినట్లయితే కూలీలకు గరిష్ట వేతనం అందుతుందని పిడి అభిప్రాయపడ్డారు. పథకంలో 100 శాతం నిబంధనను అనుసరిస్తూ పనులను చేపట్టాలని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు కూలీలకు పని దినాలు కల్పించడం ధ్యేయంగా విధులు నిర్వహించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ వంద రోజులు పని దినాలు కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. వ్యవసాయ అనుబంధ పనులు పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపించాలని అదే విధంగా శాశ్వత వనరులు సృష్టించేందుకు అవసరమైన పనులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, సమన్వయం ఎంతో అవసరమని, పథకం ప్రగతికి ఇవి దోహదపడడంతో పాటు ఉద్యోగికి మంచి గుర్తింపును తెస్తాయని పిడి అభిప్రాయపడ్డారు. జాబ్ కార్డ్ ఉన్న వారందరూ పనులకు వచ్చే విధంగా గ్రామాల్లో సభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసాను, జీవన భద్రతను కల్పించడమే ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యమని దీనికి అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో లావేరు రణస్థలం ఏపీవోలు శ్రీనివాస్ నాయుడు, శోభారాణి, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జె ఆర్ పురంలో నిర్మిస్తున్న రహదారి పనులతో పాటు గోశాల పనులను పీడీ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఘనంగా 'ముక్కోటి ఏకాదశి' వేడుకలు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, చామర్తి సాయి కృష్ణమాచార్యులు, చామర్తి శ్రీనివాసాచార్యులు, రేజేటి సతీష్‌కుమార్ ఆచార్యులు, మహేంద్రాడ సంపత్‌కుమార్, మహేంద్రాడ సత్యరామన్‌స్వామి ఆధ్వర్యంలో వేకువజామున ఉత్తర ద్వార దర్శనం ఆలయ ధర్మకర్తలు, పొట్నూరు వీరభద్రస్వామి దంపతులు, పొట్నూరు కృష్ణప్రసాద్ దంపతులుతో ప్రారంభించారు. అనంతరం మూడు గంటలకు సర్వ దర్శనం జరిగింది. ఉదయం ఏడు గంటలకు స్వామివారి గరుడోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు సహస్ర దీపాలంకరణ జరిగింది. ధనుర్మాసంలో వచ్చే ఈ ముక్కోటి ఏకాదశి నాడు ముక్కోటి దేవతలందరూ స్వామివారిని ఉత్తర ద్వారం నుండి వచ్చి, దర్శనం చేసుకుంటారు కాబట్టి, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేకించి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఈ ఉత్తర ద్వార దర్శనం చేసుకోవటం విశేషమని శాస్త్ర వచనం. అందుకు ప్రత్యేకంగా స్వామివారు వైకుంఠంలో శేష పాన్పుపై ఎలా విశ్రాంతి తీసుకుంటారో, అలా స్వామివారి ప్రత్యేకంగా అలంకరించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్, ఆయన సతీమణి, ధర్మాన పద్మప్రియతో పాటు జెడ్పీటిసి, చింతు అన్నపూర్ణ, మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, వైసిపి ప్రతినిధులు, చింతు రామారావు, తంగుడు జోగారావు దంపతులు, కె.సిహెచ్.బి.గుప్తా, కోరాడ ఆశాలత, రాజాపు హైమావతి, పాగోటి రాజారావు, గొండు స్వామిబాబు, ఎంపిటిసి, వైశ్యరాజు కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో సురక్షిత భవిష్యత్తు : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ వయస్సుతో పనిలేకుండా విధిగా హెల్మెట్ వాడాలని తద్వారా ప్రమాద రహిత జిల్లాగా మారడానికి అవకాశం ఉంటుందని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయమూర్తుల సమక్షంలో అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పైడి భీమవరం వారి సౌజన్యంతో కోర్టులో పలువురు ఉద్యోగులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు ప్రతిక్షణం ఆరోగ్యం పట్ల, వ్యక్తిగత సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కక్షిదారులతో స్నేహ సంబంధాలతో మెలగాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు, జ్యూడిషల్ సిబ్బంది సంరక్షణ కొరకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రముఖ కంపెనీ అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, పైడి భీమవరం వారి ఆర్థిక సౌజన్యంతో హెల్మెట్లను ఉచితంగా సరఫరా చేపట్టడం ఎంతో అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు వి.భాస్కరరావు, సిహెచ్ వివేకానంద్, శ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, కే కిషోర్, ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయ సేవా సాధికారత సంస్థ సభ్యులు గేదెల ఇందిరా ప్రసాద్, కొమరాపు ఆఫీస్ నాయుడు, అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు కే.నిత్యానంద రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, కే మదన్ కుమార్, కే కమలాకర్ రెడ్డి, వైయస్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - ఆమదాలవలస : జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రెండు రోజులపాటు జరగ నున్నాయి. ఈ పోటీలను ఆమదాలవలస నియో జకవర్గ వైసీపీ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు డాక్టర్ చింతాడ రవికుమార్ జగనన్న సంక్రాంతి సంబరాలు పేరిట స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహి స్తున్నారు. ఈరోజు హాజరైన పలు జట్లను టీము లుగా విభజించి డ్రా తీశారు. మొదటి విడతలో గెలుపొందిన జట్లు మధ్య క్వార్టర్, సెమీ, ఫైనల్ జట్లు ఎంపిక జరుగుతుంది. మొదటి విజేతకు 50,000, రెండవ విజేతకు 30,000, మూడు నాలుగు స్థానాల్లో నిలిచిన జట్టుకి ఒక్కొక్కరికి 20 వేల రూపాయలు వంతున బహుమతులు అందించనున్నారు. జగనన్న సంక్రాంతి సంబరాలు కబడ్డీ ఆటల పోటీలను ప్రారంభించిన అనంతరం ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. మొదటి జట్టు ఆటను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొంది.

సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన

విశాలాంధ్ర - టెక్కలి : పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సంకల్పంలో భాగంగా మండలంలో స్థానిక శాసనం గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు రహదారి భద్రతపై, మహిళల రక్షణపై, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు పై అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ రాము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రహదారి భద్రతలు పాటించకపోవడంతో రహదారి ప్రమాదాలతో అనేకమంది మృతి చెందుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ కు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. అలాగే చైన్స్ స్నాచింగ్, సైబర్ మోసాలు ఈమధ్య ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని, ఈ మధ్య కాలంలో ఎక్కువమంది మాదకద్రవ్యాలను ఉపయోగించి అనారోగ్యపాలై మృతి చెందుతున్నారని అన్నారు. కొంతమంది దాన్ని వ్యసనంగా, కొంతమంది ఆనందం కోసమని, లేదా క్షణిక ఆనందం కోసమని లేదా రకరకాల పరిస్థితులను తట్టుకోలేక ఇటువంటి వ్యసనాలకు లోబడుతున్నారని, మాదక ద్రవ్యాల పై ప్రతి ఒక్కరూ..దూరం ఉండాలని తెలిపారు. అదే విధంగా ఎవరైనా ఇటువంటి మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలా మరికొన్ని వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జేబీటీ పాఠశాల ఆధ్వర్యంలో వివేకానంద స్వామి జయంతి ర్యాలీ

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం అవలంగి జేబీటీ పాఠశాల ఆధ్వర్యంలో వివేకానంద స్వామి 163వ జయంతి పర్వదిన సందర్భంగా శుక్రవారం అవలంగి గుడికి గ్రామాలలో వివేకానంద స్వామి చైతన్య ర్యాలీని నిర్వహించారు. భావితరాలకు భవిష్యత్తు ఇచ్చిన వివేకానంద లాంటి వ్యక్తులకు ఈ దేశ భక్తులు రుణపడి ఉన్నారని ఆయన స్ఫూర్తి మనకు అవసరమని పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ అన్నారు. ఇటువంటి వ్యక్తులు ఆదర్శాలు భవిష్యత్ తరాలకి ఉపయోగపడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయనతో పాటు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

తీరంలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కవిటి : పండగ సందర్భంగా తీరంలో అప్రమత్తంగా ఉండాలని బారువ మెరైన్ పోలీసులు మూర్తి, సురేష్‌లు అన్నారు. శుక్రవారం జాలారిపాలెం, పుక్కళ్లపాలెం, పెద్దకర్రివానిపాలెం, ఇద్దివానిపాలెం తదితర గ్రామాల్లోని సముద్ర తీరాలను పరిశీలించారు. పండగ సందర్భంగా తీరంకు వచ్చినవారు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంతో ఆటలు ప్రాణ సంకటకమని హెచ్చరించారు.

లక్కీవలస పంచాయతీలో జోరుగా తెదేపా సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : ఈ మండలం లక్కీవలస పంచాయతీలో జోరుగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేస్తున్నారు. లక్కీవలస పంచాయితీ సమన్వయకర్త, సీనియర్ తెలుగుదేశంపార్టీ నాయకుడు పిట్ట రాజులు ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి పంచాయతీలో గల అందరూ తెలుగుదేశం పార్టీ తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

ఉల్లాస్ శిక్షణ విజయవంతం : జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా

విశాలాంధ్ర - శ్రీకాకుళం : మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్రప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి ఉల్లాస్ రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం మీటింగ్ హాల్ లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోజన విద్యపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ విడత జిల్లా స్థాయి ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో అన్ని మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు, ఏపీఎమ్ లు పాల్గొన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని వయోజన విద్య ఉప సంచాలకులు ముద్దాడ వెంకట రమణ అన్నారు. స్వయం సహాయక సంఘాల గ్రూపులలోని మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడంలో వాలంటీర్ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని, వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలు జిల్లాకు అందాయని తెలిపారు. అంతేకాకుండా, ఆయా టీచర్లకు ప్రోత్సాహకంగా ప్రతి ఒక్కరికి రూ.400లు మంజూరు చేయడం జరిగిందని, డిజిటల్ అక్షరాస్యత కోసం టిసిఎస్ ద్వారా ప్రతి వారం ఆన్‌లైన్ పాఠాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శాంతి శ్రీ, టిసిఎస్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జి విశ్వనాథ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతర వసూళ్లకు రంగం సిద్ధం...

సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం : ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర - పోలాకి : ప్రజా సంక్షేమం అభివృధే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం పోలాకి మండలం, వనిత మండలం గ్రామంలో పర్యటించిన శాసన సభ్యులు 1 కోటి 27 లక్షల రూపాయలతో నిర్మించిన బిటి రోడ్డును కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కటింగ్ చేసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో గ్రామాల్లో రోడ్లు,కాలువలు శిథిలావస్థకు చేరిపోయాయి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అందిస్తు న్నామని అన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని నియోజక వర్గంలో అన్ని విధాల అభివృద్ధి చేయడం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణికి కృష్ణన్నాయుడు, పోలాకి డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్ప నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు, మాజీ డిఎల్‌డిఎ చైర్మన్ సూరపు నారయణదాసు, కురిటి ఈశ్వరరావు, పోలాకి మండలం తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, వనితమండలం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీటీడీ దేవస్థానం పూర్తి బాధ్యత వహించాలి

విశాలాంధ్ర - టెక్కలి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో దర్శనం కోసం వచ్చిన భక్తులు పెద్ద ఎత్తిన తొక్కిసిలాట జరిగి నలుగురు భక్తులు చని పోవడం చాలా బాధాకరమైన విషయమని, దీనికి టిటిడి దేవస్థానం పూర్తి బాధ్యత వహించాలని భారతీయ జనతా పార్టీ తరపున బిజెపి మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగడ సానుభూతిని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు సిబ్బంది అజాగ్రత్త వల్లే భక్తులు చనిపోయారని మండిపడ్డారు. ఇటువంటి సంఘటనలు మరోసారి పునరావృత్తం కాకుండా ఉండాలని ఆయన ఖండించారు. ఈ సంఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించిన తీరు హర్షనియమని, ఎవరైతే చనిపోయిన భక్తులు ఉన్నారో, అలాగే గాయాలు తగిలిన భక్తులుకు కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయకుమారి, జిల్లా మోర్చా కార్యదర్శి జె.మోహన్ బాబు, మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యులు సోమయ్య, మోహన్ పాల్గొన్నారు.

ప్రజా క్షేమమే ధ్యేయంగా కొనసాగుతున్న వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - పొందూరు : డయేరియాను తుద ముట్టడించి, ప్రజా క్షేమమే ధ్యేయంగా వైద్య ఆరోగ్యశాఖ ఉత్సహంగా పని చేయాడంతో నర వేగంగానే సద్దుమణిగింది. పండగంటి పూట ఎలా ఉంటాదో అన్న భయం విడనాడి. ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. తాడివలస ఆరోగ్య కేంద్ర సిబ్బంది, మేజర్ పంచాయితీ సిబ్బంది అదుపు చేయడానికి ఓ సవాల్గా తీసుకొని పనిచేశారు. డయేరియా పూర్తి స్థాయిలో అదుపులోకి వచ్చినా సిబ్బంది సేవలు ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. వైద్య కేంద్రాలను ముమ్మరం చేస్తూ, డోర్ టు డోర్ సిబ్బంది కదలి ఇంటింటా ప్రజా క్షేమాలను అడిగి తెలుసుకుంటున్నారు. పాలక పంచాయతీ పాలకవర్గం డయేరియా తగ్గుముఖానికి ప్రత్యేక కృషి చేసినందుకు గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు. సేవా భావంతో పనిచేసిన వైద్య ఆరోగ్య కేంద్ర, పంచాయితీ శానిటరీ సిబ్బంది సేవలు కరోనా కాలాన్ని తలపించే రీతులో పనిచేయడం పట్ల గ్రామ ప్రజా సంఘాలు ముక్తకంఠంతో అభినందిస్తున్నాయి.

చిన్న కథల పోటీలు విజేత సిద్ధార్థ్

విశాలాంధ్ర - కవిటి : విద్యార్థి వికాస వాహిని విజయ వాడ కేంద్రంగా 6వ ప్రపంచ తెలుగు మహాసభలలో రచయితల సమ్మేళనం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలలో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు చిన్నకథల పోటీ నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలో గల ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాసి పంపించిన మూఢనమ్మకాలు అనే కథ ప్రథమ బహుమతి సాధించింది.కవిటి మండలం విద్యార్థి రాష్ట్రస్థాయి చిన్నకథల పోటీ లో ప్రథమ బహుమతి సాధించినందుకు మండల విద్యాశాఖ అధికారులు ధనుంజయ మజ్జి, కె చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయులు జి.శాంతి, తల్లితండ్రుల కమిటీ అధ్యక్షురాలు ఆర్. చిరంజీవమ్మ, గ్రామ పెద్దలు పండి. సత్య నారాయణ, పాతిన చంద్రశేఖర రావు,జల్లు రవి, అరంగి వెంకటరావు, పాతిన వెంకటరావు, ఉపాధ్యాయులు అనింగి నాగేశ్వరరావు, కింజరాపు రామకృష్ణ, సింహాచలం, అప్పల రాజు, కృష్ణ, నాగమణి, మొర్రి గోపి అభినందించారు.

వివేకానందుని మార్గం అనుసరణీయం

జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్యాం సుందర్

విశాలాంధ్ర - ఆమదాలవలస : స్వామి వివేకానంద మార్గం యు వతకు అనుసర ణీయమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ అన్నారు. ప్రభుత్వ జూని యర్ కళా శాల ఆమదాల వలస కళా ప్రాంగణంలో శుక్రవారం స్వామి వివేకానంద 163 వ జయంతి వారోత్స వాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యా ర్థులు సాంస్కృతి కార్యక్రమాలలో పాల్గొని అంద రినీ అలరించారు. జాతీయ సేవా పథకం అధికారి జలు మూరు రవిబాబు ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, జానపద గీతాలు, క్లాసికల్ మరి యు జానవద నృత్యాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ బి. శ్యామసుందర్ మాట్లాడుతూ స్వామి వివేకా నంద సూక్తులను ప్రతి విద్యార్థి పాటించాలని ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాప కేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, పూర్వ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న విజేతలకు రోట రీ గవర్నర్ వెంకటేశ్వరరావు మరియు ప్రస్తుత రోటరీ కార్యదర్శి జలుమూరు రవిబాబు బహు మతులను అందజేశారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర - కవిటి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా కలియుగ దైవం తిరుపతి వెంకటేశ్వర స్వామిని ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబ సమే తంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రామారావు సతీమణి మాజీ ఎంపీపీ నర్తు చామంతి, కు మారుడు నర్తు రవి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించు కున్నారు. రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్సీ రామారావు ఆకాంక్షించారు.

గోవింద నామస్మరణంతో మార్మోగిన దేవాలయాలు

విశాలాంధ్ర - పొందూరు : ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని మండలంలో వైభవంగా దైవ నామస్మరణంతో పూజలు నిర్వహించారు. కోదండరామ, వెంకటేశ్వర, రామలింగేశ్వర, సోమలింగేశ్వర, మల్లి కార్జున, కాశి విశ్వేశ్వర దేవాలయాల ముందు భక్తిశ్రద్ధలతో ఉపవాస్యలతో గోవింద నామస్మరణాలు మార్మోగాయి. వేద పండితుల మంత్రోక్షరణాలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శారీరక దారుఢ్య పరీక్షల్లో 275 అభ్యర్థుల అర్హత

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన శారీరక దారుఢ్య పరీక్షల్లో 275 మంది అర్హత సాధించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వ హించారు. 661 మంది అభ్యర్థుల హాజరు కావల్సి ఉండగా, 400 మంది హాజరయ్యారు. కాగా, ఈ నెల 8వ తేదీన జరగాల్సిన శారీరక దారుఢ్య పరీక్షలు ఈ నెల 11వ తేదీన హాజరుకావాలని ఎస్పీ కోరారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని ఎచ్చెర్ల, అల్లినగరం, ఫరీద్పేట, ఎస్ఎంపురం తదితర గ్రామాల్లోని శుక్రవారం వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. భక్తులు వేకువజాము నుంచే స్వామివారికి దర్శనానికి క్యూకట్టారు. ఫరీదీపేటలోని శ్రీ రంగనాథ స్వామి, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీనివాస ప్రార్థన మందిరం, అల్లినగరంలో శ్రీ రమా సత్య నారా యణ స్వామి, ఎస్ఎంపురంలో విష్ణు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎచ్చెర్లలోని వెంక టేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో, శ్రీ వెంకటే శ్వర ఇంజ నీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో శుక్రవారం సం క్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. భోగిమంటలు, పొంగలి తయారీ, నాటు బండ్లు, ముగ్గులు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

- సంగమేశ్వర ఆలయం వద్ద వర్గాల కుమ్ములాట
- ఆదాయం పంచాయతీకి దక్కేనా

విశాలాంధ్ర - ఆమదాలవలస : సుప్రసిద్ధ సంగమేశ్వర జాతరకు సంక్రాంతి మొదలు ముక్కనుమ వరకు మూడు రోజులపాటు భ క్తులు వేల సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో తో పాటు విజ యవాడ, విశాఖపట్నం, ఒరిస్సా రాష్ట్రం నుంచి భక్తులు వస్తుంటారు. సర్వమత సంగమేశ్వరుని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. దూరం నుంచి వచ్చేవారు ఈ ప్రాంతంలోనే వంటలు నిర్వ హిస్తారు. వీరికి స్థానికులు సహకరిస్తుంటారు. మం దలంలోని గాజుల కొల్లివలస వద్దనున్న సంగమే శ్వరుని కొండ పరిసరాల్లో జాతర సందడి సంక్రాంతి సందర్భంగా జరుగుతుంది. ఇదిలా ఉండగా ఈ ఏడాది అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు తో పాటు స్థానిక వ్యక్తి సేవ ముసుగులో దోపిడీకి తెర లేపనున్నారు. మండల పంచాయతీ అధికారులు సలహాతో కోటబొమ్మాలి తరహా వసూళ్లు చేసి పంచాయితీ ఖాతాలో జమ చేసి గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని ఇచ్చిన సలహా మేరకు వసూళ్లకు సచివాలయ కార్యదర్శి ఆధ్వర్యంలో బిల్లు బుక్కులు తయారు చేశారు. అయితే అధి కార పక్షానికి చెందిన కొంతమంది షాపులు నిర్వా హకుల వద్ద నుంచి వసూలు చేసి ఆలయ అభి వృద్ధికి వినియోగించాలని మెలిక పెట్టి అనధికార వసూళ్లకు రంగం సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా స్థానికంగా నివాసముంటున్న వ్యక్తి సంగమయ్య జాతరకు నా వల్లనే పేరు వచ్చిందని అందుకు నా సమక్షంలోనే ఏదైనా జరగాలంటే మరో మెలిక వేశారు. సంబంధించి రంగులరాట్నం, బొమ్మల షాపులు, తినుబండారాలు షాపులు తదితరాలు ఏర్పాటు చేసేందుకు వీలుగా చిన్న కూర్మన్న చెరు వును జెసిబి తో సదును చేయించారు. ఇలా ఎవరి కివారుగా వసూలు చేసేందుకు సన్నాహాలు చేస్తుం డగా విషయం తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్ సంగమేశ్వర జాతరలో భక్తులు ఇచ్చే ప్రతి పైసా పంచాయతీ ద్వారా ఆలయ అభివృద్ధి, గ్రామా భివృద్ధికి ఉపయోగపడాలని లేకుంటే ఎప్పటి వలె వసూలు చేయకుండా ఉండాలని తెలిపారు. పం చాయతీ ఆదేశాలు లేకుండా వసూళ్లకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. ఇప్పటికే గతం వలె షాపులు రంగుల రాట్నం తదితర తది చిన్నపిల్లల ఆటో వస్తువులు ఏర్పాటుకు స్థానిక వ్యక్తి ద్వారా ఒరిస్సా రాష్ట్రం నుంచి నిర్వాహకులను రప్పించారు. ఎవరి అను మతులు లేకుండా ఏమిటీ దుస్సాహసం అంటూ స్థానికులు అంటున్నారు. గతంలో నిర్వాహకుల వద్ద నుంచి అనధికార వసూలు చేసి పబ్బం గడు పుకునే వారికి కోటబొమ్మాలి తరహా వసూళ్లు మింగుడు పడడం లేదు. మూడు రోజులపాటు జరిగే ఈ జాతరలో పోలీసులు నిరంతరం గస్తీ తిరుగుతుంటారు. ఎటువంటి అసంఘటిత సంఘ టనలు జరగకుండా చర్యలు తీసుకుంటారు. ఇంత పగడ్బందీగా జరుప తలపెట్టే జాతరకు కొందరు అక్రమ వసూళ్లకు సన్నాహాలు చేయడం విడ్డూ రంగా ఉందని పలువు ఆక్షేపిస్తున్నారు. పంచా యతీ పరిధిలో జరిగే వసూలు ఏవైనా పంచా యతీ ఖాతాలో జమ చేసి అభివృద్ధికి సహక రించాలని స్థానికులు అంటున్నారు. అధికార, ప్రతిపక్ష, స్థానిక నాయకులతో సమాలోచనలు చేసి ఆలయ అభివృద్ధికి పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిఐ అంబటి విజయ్ కుమార్

విశాలాంధ్ర - టెక్కలి : మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సీఐ అంబటి విజయ్ కుమార్ అన్నారు. పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలో స్థానిక అయోధ్యపురం గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు రహదారి భద్రతపై, మహిళల రక్షణపై, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు పై, అవగాహన కార్యక్రమాన్ని సీఐ విజయ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రహదారి భద్రతలు పాటించక పోవడంతో ఈ మధ్యకాలంలో రహదారి ప్రమాదాలతో అనేకమంది మృతి చెందుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ కు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. అలాగే చైన్స్ స్నాచింగ్, సైబర్ మోసాలు ఈమధ్య ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని, ఈ మధ్య కాలంలో ఎక్కువమంది మాదకద్రవ్యాలను ఉపయోగించి అనారోగ్యపాలై మృతి చెందుతున్నారని అన్నారు. కొంతమంది దాన్ని వ్యసనంగా, కొంతమంది ఆనందం కోసమని, లేదా క్షణిక ఆనందం కోసమని లేదా రకరకాల పరిస్థితులను తట్టుకోలేక ఇటువంటి వ్యసనాలకు లోబడుతున్నారని, మాదక ద్రవ్యాల పై ప్రతి ఒక్కరూ..దూరం ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఎవరైనా ఇటువంటి మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలా మరికొన్ని వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రమాదాలపై మాక్ డ్రిల్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని పొన్నాడలో గల దీపక్ మైనింగ్ సొల్యూషన్స్ లిమిటెడ్ యూనిట్ లో అత్యవసర ప్రమాద మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా అగ్నిమాపక శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్తముగా నిర్వహించిన అత్యవసర మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భముగా తమ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రమాదాలపై అవగాహన, భద్రతా పరికరాలను ఉపయోగించడం, ప్రమాదకర పరిస్థితుల్లో పాటించవలసిన పద్ధతులను మాక్ డ్రిల్ సందర్భముగా అవగాహన కల్పించారు. పరిశ్రమలోని ఎవాపరేటర్స్,, బాయిలర్లు, కండెన్సర్లు, ఇతర లెవెల్ గేజ్ సొల్యూషన్స్ వాల్వ్ ద్వారా అమ్మోనియా ద్రావణం లీకు వలన సంభవించే ప్రమాదాలపై డ్రిల్ నిర్వహించారు.అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడం, యూనిట్ ప్రతిస్పందన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యూనిట్ హెడ్ మనోజ్ అద్దాల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు, ఎన్డీఆర్ఎఫ్ అధికారి రాము, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తరపున రాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఐతమ్‌లో పెద్ద ఎత్తున సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - టెక్కలి : తెలుగుజాతి పండగల్లో అతిముఖ్యమైన సంక్రాంతి పండగ సంబరాలు శుక్రవారం టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో పెద్దఎత్తున జరిగాయి. ఉదయం నుండి తెలుగు సాంప్రదాయం ప్రకారం ఆనందోత్సాహాల మధ్య కోలాటం, ముగ్గుల పోటీలు, గాలిపటాల ఎగురవేతలతో పాటు విద్యార్థులు నృత్యప్రదర్శనలతో కళాశాల వేడుకగా మారింది. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలు వలువుర్ని అలరించాయి. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల విజేతలకు కళాశాల ఉపాధ్యక్షురాలు సుధాప్రియా, కోశాధికారి టంకాల నాగరాజు డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావులు బహుమతులను అందజేశారు.

కేరింతల నడుమ డ్యాన్సులు... విద్యార్థులు పెద్దఎత్తున సినీగేయాలకు డ్యాన్సులు వేసే యువతీ యువకులకు ప్రతిస్పందనగా ప్రేక్షక యువత ఉర్రూతలు, కేరింతలు చేస్తూ పెద్దఎత్తున సందడి చేశారు. అనంతరం కళాశాల మైదనానంలో ముందస్తుగా ఏర్పాటు చేసిన బోగీ మంటను యాజమాన్య సభ్యులు వెలిగించారు. విద్యార్థులు, సిబ్బంది, బోగీ మంట చూట్టూ నృత్యం చేశారు.

షర్మిల దృష్టికి జిల్లా, యోజకవర్గ సమస్యలు

విశాలాంధ్ర - కవిటి : శ్రీకాకుళం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ శుక్రవారం విశాఖపట్నం దస్పల్ల హెూటల్లో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా మరియు ఇచ్చాపురం నియోజకవర్గ సమస్యలు గురించి వివరించారు. అనంతరం షర్మిల పూడి కిరణ్ కుమార్ తో మాట్లాడుతూ జిల్లాలో యూత్ కాంగ్రెస్ పటిష్టం చేయాలని, 2029లో రాహుల్ గాంధీ ప్రధాని చేయడం లక్ష్యంగా యువత పనిచేయాలని సూచించినట్లు తెలిపారు.